



19 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

శుక్రవారం 7 నవంబర్ 2025 పేజీలు 8


# కుక్కలు బాబోయ్..

- బెంబేలెత్తుతున్న స్థానికులు
- గుంపులుగా సంచరిస్తున్న శునకాలు
- చిన్నారులను, మూగ జీవులను గాయపరుస్తున్న శునకాలు
- పూర్తి స్థాయిలో నియంత్రణ చేపట్టని అధికారులు



**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ :** ఇంట్లో నుంచి బయటికి అడుగు పెట్టాలంటే బాబోయ్ కుక్కలు అంటూ బాపులపాడు మండలం రైల్వే స్టేషన్ స్టేషన్ సమీపంలోని జగనన్న కాలనీలో నివసిస్తున్న స్థానికులు బెంబేలెత్తుతు న్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా.ఎక్కడ పడితే అక్కడ కాలనీ వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు వచ్చే పోయే వారిపై దాడులు చేయడంతో కాలనీలో నివసిస్తున్న స్థానికులు, చిన్నారులు, వృద్ధులు, భయాందోళనలకు గురవుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఏ రోడ్లో చూసినా కుక్కలు గుంపు కనబడుతున్నాయి. కాలనీలో ఒంటిరిగా వెళ్లాలంటేనే కాలనీవాసులు జంకుతున్నారు. గతంలో పంచాయతీ సిబ్బంది కుక్కల్ని పట్టడానికి వచ్చామని హడావుడి చేశారు గాని ఒక దాన్ని కూడా పట్టుకోలేదని వాపోతున్నారు. పంచాయతీ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా,తమ గోడు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు కాలనీల్లో గుంపులు, గుంపులుగా ఉన్న కుక్కలను లెక్కిస్తే 500కి పైగానే ఉంటాయని వారు అంటున్నారు.ఉదయం వేళ స్కూల్ బస్సు,ఆటో కోసం విద్యార్థులు వేచి ఉంటున్న సందర్భంలో కుక్కల గుంపును చూసిన విద్యార్థులు భయపడుతున్నారు.కుక్కల దాడి నుంచి తప్పించుకోవడానికి వేగం పెంచి,వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.కాలనీ నుంచి ఇంటీకి వెళ్లే దారిలో సోమవారం రాత్రి పది కుక్కలున్న గుంపు ఓ ద్విచక్రవాహన చోదకుడిపైకి వచ్చాయి. చాకచక్యంగా అతడు తప్పించుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.ఇంట్లో ఉన్న తినుబండరాలు, నిత్యవసర సరుకులు, వస్తువులను ఎత్తుకెళ్లడంతోపాటు, గుంపులుగా సంచరిస్తూ ఇంటిదగ్గర పెంచుకుంటున్న కోళ్ళ, మూగ జీవాలను ఎంచక్కా తినేస్తూ స్థానికులపై దాడులకు దిగుతూ గాయపరుస్తున్నాయి. కుక్కల నియంత్రణలో అధికారులు మిగతా 2లో





కిడ్నీ బాధితుల ఆరోగ్యానికి

## పూర్తి భరోసా

నెఫ్రాలజిస్టు వైద్య సేవలను విస్తృతం చేస్తాం

రోగులకు మందులు, పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టిపెడుతున్నాం

వచ్చే జనవరి నుంచి ఎ.కొండూరుకు కృష్ణా జలాలు పంపిణీ చేస్తాం

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

వివరాలు 2లో...

పాడి పరిశ్రమ అభివృద్ధిలో

## పశు వైద్యుల పాత్ర ఎంతో ఘనమైనది

కృష్ణాజిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం అభివృద్ధిలో పశు వైద్యుల పాత్ర ఎంతో ఘనమైనదని, ప్రజల జీవనోపాదులను మెరుగుపరచడంలో మరింత కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ సమావేశపు మందిరంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ పశువుల మిషన్ – శాస్త్రీయ నిర్వహణ గొర్రెలు, మేకల పెంపకం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి చిన నరసింహులు, ఆ శాఖ చేపడుతున్న వివిధ సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒక దేశ స్థూల దేశీయోత్పత్తి జిడిపి పెరుగుదలలో పాడి, కోళ్ల పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఇది ప్రజల జీవనోపాదులను పెంపొందించడంలో ముఖ్య భూమిక పోషిస్తుందని, ఎన్నో కుటుంబాలను పేదరికం నుంచి విముక్తి కలిగించేందుకు పశు సంవర్ధక శాఖ అధికారుల కృషి అభినందనీయమన్నారు. జిల్లాలో పాల ఉత్పత్తులను గణనీయంగా పెంచి రైతులకు అధిక ఆదాయాన్ని పెంచే విధంగా మరింత కృషి చేయాలన్నారు. ఆ దిశగా పశుపోషకులను ప్రోత్సహించాలని, వారికి అవగాహన కార్యక్రమాలు మిగతా 2లో...

# తహసీల్దార్ పి.మనోహర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి



## వీఆర్‌ఓ ఆత్మహత్యాయత్నం సంఘటనపై డీఎంహెచ్‌ఓకు, ఆంధ్ర హాస్పిటల్‌కు లీగల్ నోటీస్

**జగ్గయ్యపేట నవంబర్ 06 మేజర్ న్యూస్ :** జగ్గయ్యపేట తహసీల్దార్ పి. మనోహర్ వేధింపుల కారణంగా వీఆఓ లక్ష్మి విషం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిందని విషయం సోషల్ మీడియాలో వైరల్ అయిందని దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా జిల్లా రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తాను ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు సీనియర్ న్యాయవాది పి నాగేందర్ రెడ్డి ద్వారా సంబంధిత మెడికల్ మెడికో లీగల్ కేసును దాసి ఉంచి చికిత్స చేసిన ఆంధ్ర హాస్పటల్ విజయవాడ కి, సమాచారం తెలిసి నిబంధనలు పాటించని ఆసుపత్రి యాజమాన్యానికి సహకరించిన ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు లీగల్ నోటీసును తాను పంపించడం జరిగిందని తెలిపారు. వీఆర్వో చికిత్స కోసం విజయవాడలోని ఆంధ్రా హాస్పిటల్లో చేరారు. ఇది మెడికో లీగల్ కేసు అయినప్పటికీ, ఈ కేసు సమాచారాన్ని సంబంధిత పోలీసులకు తెలియజేయకుండా రహస్యంగా అనేక రోజులు పాటు చికిత్స చేశారని, మెడికో లీగల్ కేసుగా కలిగి ఉండి, రోగి ఫిర్యాదు ఇచ్చే స్థితిలో లేనప్పటికీ సంబంధిత పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వాన్ని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని తెలిపారు. మెడికో లీగల్ కేసుగా ఉన్నప్పటికీ, ఆంధ్రా హాస్పిటల్ యాజమాన్యం సాధారణ కేసుగా భావించి చికిత్స అందించిందని. తహసీల్దార్ పి. మనోహర్ దుష్ప్రవర్తన, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు వారిపై శాఖాపరమైన చర్య తీసుకోవాలని. ఆర్డీఓ నందిగామ వారు ఆసుపత్రిని సందర్శించి విషయం తెలుసుకొని కూడా, శాఖాపరమైన చర్య లేదా తహశీల్దార్పై క్రిమినల్ ప్రాసిక్యూషన్ను సిఫార్సు చేయలేదు. అందువల్ల, విధుల నిర్లక్ష్యం కోసం తహసీల్దార్ పి. మనోహర్ పై తగిన చర్య తీసుకోవాలని తాను లీగల్ నోటీసులు పంపించడం జరిగిందని తెలిపారు. దీనిపై ప్రత్యేకంగా జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



## వన సమారాధనలో ఎమ్మెల్యే



**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కొండిపర్రు శివాలయంలో గురువారం జరిగిన కార్తీక వనసమారాధన కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత శివాలయంలో కుమార్ రాజా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వన సమారాధన కార్యక్రమంలో భాగంగా ఉసిరి చెట్టుకు నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కుమార్ రాజాకు ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు వీరాంజనేయులు లతోపాటు పలువురు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార్ రాజాకు గ్రామస్తులు స్వాగతం పలికి ఆయనను సత్కరించారు.

# ఇంతేరు భూముల ఆక్రమణకు, సాగుకు సహకరించిన అధికారులను సస్పెండ్ చేయాలి

**సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్**

**శ్రీనివాస గౌడ్ నుండి స్టేట్మెంట్ రికార్డు చేసిన ఏపీటీఎస్ అధికారులు..?**

**అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ విద్యుత్ శాఖ అధికారుల సస్పెండ్ చేయాలి..?**



**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** జిల్లాలోని కృత్తివెన్ను మండలం ఇంతేరు రెవెన్యూ గ్రామంలో విలేజ్ నెంబర్ 16 సర్వే నెంబర్ 94లో 3501 ఎకరాల మడ భూములు ఆక్రమణకు గురికావడానికి కారకులైన అధికారులను తక్షణం సస్పెండ్ చేయాలని, యు ఎఫ్. ఆర్టిఐ రాష్ట్ర కో కన్వీనర్ జంపాన శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇంతేరు మడభూములను కొందరు బడా బాబులు గత ప్రభుత్వ హాయంలో రాజకీయ నాయకులు ప్రోత్సాహంతో ఆక్రమించి చెరువులను త్రవ్వారని దీనిపై లోకాయుక్త జస్టిస్ లక్ష్మారెడ్డి, ఉపలోకయుక్త జస్టిస్ రజిని,ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి కే విజయానంద్ కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ ఫారెస్ట్ భూములను బడా బాబులకు కట్టబెట్టడంలో గత ప్రభుత్వంలో రాజకీయ నాయకుడుకి కోట్లాది రూపాయలు ముడుపులు ముట్టాయని, అధికారులు సైతం ఒత్తిడికి లొంగిపోయారని పేర్కొన్నారు. చిన్నచిన్న రైతులు మడ అడవులను సాగు చేసుకుంటూ జీవిస్తున్నారని, ఈ నేపథ్యంలో ఆయా భూములను పెద్ద పెద్ద రైతులకు కట్టబెట్టి సన్నకారు రైతులకు ఎకరాకు సుమారు 8000 రూపాయిలు లీజు ఇచ్చే విధంగా ఒప్పందం కుదిరింది అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ శాఖ అధికారులు ఆయా చెరువులకు ట్రాన్స్ఫార్మర్లు నిర్మాణం చేసి విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేశారని వివరించారు. విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయడానికి గ్రామ వి ఆర్ ఓ, ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారని తెలిపారు. ఆయా అంశాలను రికార్డు పరంగా గతంలో ఏపీ టీఎస్ సిఐ దిరిశాల వెంకన్న చౌదరి ఎస్సై పి ముక్కంటి స్టేట్మెంట్ రికార్డ్ చేశారన్నారు గురువారం రెండోసారి ఏపీ టీఎస్ ఎస్సై స్థాయి అధికారి ఆర్ దాస్ స్టేట్మెంట్ నమోదు చేసుకోవడం జరిగిందని తెలిపారు. అటవీ పర్యావరణ భూములను పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అనుమతులు మంజూరు చేశారు అన్నారు ఆయా శాఖల అధికారులపై జీవో ఎమ్మెస్ నెంబర్ 458 ప్రకారం శాశ్వతంగా విధుల నుండి తొలగించాలని, శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి నియోజకవర్గ ఆర్టీఐ కో కన్వీనర్, సాంబశివరావు, తోట్లవల్లూరు ఉయ్యూరు మండలాల కో కన్వీనర్లు సాకే రాములమ్మ, బొల్లా శివ పార్వతి పాల్గొన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కుమార్ రాజా







**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని అలినఖిపాలెం గ్రామంలో ఇటీవల పలువురు మృతి చెందగా వారి కుటుంబాలను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పరామర్శించారు. గ్రామానికి చెందిన షేక్ అమానుల్లా, సజానే అబ్బాస్ లు మరణించగా వారి కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే గ్రామ ఉపసర్పంచ్ లియాఖత్ అలీ తల్లి ఇటీవల మరణించగా వారి గృహమునకు వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామంలో మీర్జా ఖైసర్ అలీ, మీర్జా పర్వేజ్ లు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను కూడా ఆయన పరామర్శించారు. ఆయా కుటుంబాల సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## టీడీపీ నేతకు మాతృవియోగం

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మండలంలోని చెవుటూరు గ్రామ తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు, నాగార్జున సాగర్ కాలువ డీసీ చైర్మన్ ఉమ్మడి వెంకటస్వామి మాతృమూర్తి రమణమ్మ(85) ఇటీవల మృతి చెందారు. నేడు గురువారం చెవుటూరులో ఆమె సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. ఆమె పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. ఉమ్మడి వెంకటస్వామిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## నీలకంఠేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శ



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని అగినపర్రు గ్రామంలో గురువారం జరిగిన వీరంకి నీలకంఠేశ్వరరావు భార్య పెద్దకర్మ కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఆయన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెళ్ల సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు బొబ్బా ప్రకాష్, కందిమళ్ళ సుబ్రహ్మణ్యేశ్వరరావు, దగ్గుబాటి ఫణి కుమార్, లింగమనేని బాబురావు, చిగురుపాటి వెంకట కృష్ణారావులతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించిన ఎమ్మెల్యే



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మేడూరు గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన యార్లగడ్డ శశిధర్ వెంకట్ కు19,883 రూపాయలు, వీరంకి సుబ్బారావు కు 90,824 రూపాయలు వంతున ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం మంజూరు కాగా ఆ చెక్కులను కుమార్ రాజా స్వయంగా అందించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకుని వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు కృష్ణాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెళ్ల సుబ్రహ్మణ్యం, పలువురు స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నిమ్మకూరులో కన్నుల పండుగగా కోటి దీపోత్సవం



**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని నిమ్మకూరు లో గల శివాలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని కోటి వత్తులు తో మహా దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. భక్తుల కోలాహలం నడుమ కన్నుల పండుగగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తి ప్రపత్తులతో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, జ్యోతిష్యం, జ్వాలాతోరణం నిర్వహించారు.

## టీడీపీకి బొల్లా రామ్మోహన్ రావు లేని లోటు తీరనిది



**పెడన, మేజర్ న్యూస్:** ఆకుమర్రు గ్రామానికి బొల్లా రామ్మోహన్ రావు చేసిన సేవలు మరువలేనివి అని ఆయన లేని లోటు పార్టీకి ఎప్పటికీ తీరనిది అని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ సంబంధించిన చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు మండలం ఆకుమర్రు గ్రామంలో బొల్లా రామ్మోహనరావు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించడంతో ఆయన కుటుంబానికి టిడిపి ప్రమాద బీమా ఐదు లక్షల చెక్కును అందించామని తెలిపారు. బొల్లా రామ్మోహన రావు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడు, క్రియాశీలక సభ్యత్వం ఉండడంతో ఇన్సూరెన్స్ 5 లక్షల రూపాయలు వచ్చాయన్నారు. ఆకుమర్రు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా తెలుగుదేశం పార్టీకి, ప్రజలకు ఎంతో సేవ చేశారని పేర్కొన్నారు. కష్టకాలంలో పార్టీ వెన్నంటే నడిపించిన గొప్ప వ్యక్తి రామ్మోహన్ రావు అని పేర్కొన్నారు. అలాంటి వారి అకాల మరణం టీడీపీ కుటుంబానికి తీరని లోటు అని చెబుతూ అతని కుటుంబం అన్నివేళలా తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతన స్వామి, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు గోపి నాగబాబు, మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు,బొల్లా రాజేష్, గంజాల కృష్ణమోహన్,మురల హరి, తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆర్థిక ప్రగతికి పి-4 దోహదం



**జి కొండూరు మేజర్ న్యూస్ :** పేదల ఆర్థి కస్థితిని మెరుగు పర్చడమే పి-4 కార్యక్రమ ప్రధాన లక్ష్యమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. పి-4 కార్యక్రమంలో భాగంగా మైలవరం జ్యుయలరీ షాప్స్ ఆధ్వర్యంలో మేడసాని కిషోర్ సౌజన్యంతో కొండపల్లిలో 10 కుటుంబాలకు రూ.80 వేల విలువైన సామాగ్రి, నగదును ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ దార్శనికులు సీఎం చంద్రబాబు ఆలోచనలో నుంచి పి-4 ఉద్భవించిందన్నారు. సంపద కలిగిన కుటుంబాలు అట్టడుగున ఉన్న కుటుంబాలకు అండగా నిలబడటమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. పేదల సాధికారత కోసం చేపడుతున్న ఈ కార్యక్రమంలో ఉన్నత కుటుంబాల వారంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పేద కుటుంబాలను ఆదుకున్న దాతలను అభినందించారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు(గాంధీ), ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## డెయిరీ రంగానికి విశిష్ట సేవలు అందించిన మండవ జానకిరామయ్యకు ఘన నివాళి



**గన్నవరం, నవంబర్ 6, మేజర్ న్యూస్ :** మాజీ విజయ డెయిరీ చైర్మన్ మండవ జానకి రామయ్య గురువారం పరమ పదవదించారు. గన్నవరం మండలం దావాజీగూడెం గ్రామంలో వారి పార్థివ దేహానికి అవనిగడ్డ శాసన సభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ తో కలిసి పూలమాలవేసి నివాళులర్పించిన మాజీమంత్రి ఎన్టీఆర్ జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు, ఉమ్మడి కృష్ణా జిల్లా కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం. ఈ సందర్భంగా నెట్టం రఘురాం మాట్లాడుతూ సుమారు 27 సంవత్సరాల పాటు విజయ డెయిరీ చైర్మన్‌గా మండవ జానకిరామయ్య సుదీర్ఘకాలం సేవలందించారని ఆయన పాలనా కాలం విజయ డెయిరీకి "సువర్ణ యుగం"గా నిలిచింది అని పాడి రైతుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన సంస్కరణలు, రూపొందించిన వ్యూహాలు విజయ డెయిరీని రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ స్థానానికి చేర్చాయి అని రైతుల నుంచి పాలు సేకరించడం నుంచి వారికి గిట్టుబాటు ధర కల్పించడం వరకు అనేక సంస్కరణలు చేపట్టి, వారి ఆదరాభిమానాలను చూరగొన్నారు అని మండవ జానకిరామయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని ఈ సందర్భంగా తన సంతాపాన్ని తెలియజేశారు.

# గ్రంథాలయాలు నైతిక విలువలు పెంపొందిస్తాయి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** గ్రంథాలయాల ద్వారా వ్యక్తులలో నైతిక విలువలు పెంపొందుతాయని నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు అన్నారు. జిల్లా గ్రంథాలయంలో గురువారం కమిషనర్ బాపిరాజు ప్రముఖ నవలా రచయితలు అడివి బాపిరాజు, విశ్వనాథ సత్యనారాయణలచే రచించబడిన సాహితీ, ఆధ్యాత్మిక నవలలు టిడిపి సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ జిల్లా కేంద్ర గ్రంథాలయం అధికారి, బి. విజయ్ కుమార్ కు అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రముఖ సాహితీవేత్తలు, నవలా రచయితలు అడవి బాపిరాజు, విశ్వనాథ సత్యనారాయణ ల చే రచించబడిన సాహిత్య, ఆధ్యాత్మిక, నవలలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. బాపిరాజు, విశ్వనాథ వారి నవలలు, సమాజాన్ని జాగృత పరిచాయన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఆ మహనీయుల జయంతి, వర్ధంతిల కార్యక్రమాలను లైబ్రరీలలో జరుపుతూ, వారి జీవిత విశేషాలను పాఠకులకు తెలియజేయాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ లైబ్రరీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను లైబ్రరీలకు పంపుతూ పుస్తక పఠనం ద్వారా కలిగే లాభాలను తెలియజేయాలని సూచించారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గా నియమితులైన పి. వి. ఫణి కుమార్ ను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ కమిషనర్, బాపిరాజు, గ్రంథాలయ అధికారి, బి. విజయ్ కుమార్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ వేము కోటేశ్వరరావులు అభినందించి, ఘనంగా సత్కరించారు.

## బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం చంద్రబాబుది

### ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గా పివి ఫణి కుమార్ ను ఎంపిక చేసినందుకు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, టిడిపి రాష్ట్ర నాయకులు కొనకళ్ళ జగన్నాథ రావు (బుల్లయ్య) లను పి. వి. ఫణి కుమార్ ఘనంగా సత్కరించారు. ఫణి కుమార్ ను నారాయణ రావు, బుల్లయ్యలు అభినందించి సత్కరించారు. నారాయణరావు మాట్లాడుతూ బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించిన ఘనత చంద్రబాబు దేనన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిరుపేద బ్రాహ్మణులు ఆర్థిక ఇబ్బందులు పడకుండా వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా నిలుస్తోందన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గత టిడిపి ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను మరల బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. తనకు బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ లో రాష్ట్ర డైరెక్టర్ పదవి వచ్చేందుకు మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్, కొనకళ్ళ నారాయణరావు తదితర పెద్దలు చేసిన కృషి మరువలేనిదని వారికి కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ హసీం బేగ్, పవన్ కుమార్ శర్మ, మిధున వ్యాస్, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

## రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఏడుకొండలస్వామికి విన్నపం



**గన్నవరం, నవంబర్ 6, మేజర్ న్యూస్ :** కూటమి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండేందుకు తోడుగా వుండాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని వేడుకున్నారు. గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో యార్లగడ్డ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కూటమి పాలనలో అభివృద్ధికి ఆటంకాలు కలుగకుండా చూడాలని వెంకన్న స్వామిని కోరుకున్నట్లు యార్లగడ్డ తెలిపారు. గన్నవరం అభివృద్ధికి తోడుగా ఉండాలని, రాష్ట్రంలో శరవేగంగా సాగుతున్న పరిశ్రమల ఏర్పాటుకు స్వామివారు అండగా ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో పాడిపంటలు సంవృద్ధిగా పండి రైతులందరూ సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని స్వామికి మొక్కుకున్నట్లు యార్లగడ్డ తెలిపారు.

## ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి



**జి కొండూరు మేజర్ న్యూస్ :** కొండపల్లి ఆరోగ్యమే మహా భాగ్యం అని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాదు పేర్కొన్నారు. కొండపల్లి మున్సి పాలిటీ పరిధిలోని పాత వెంకటేశ్వర థియేటర్ వద్ద ఉన్న అనుమోలు కన్వెన్షన్ హాల్ వద్ద డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్టీటీపీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని, వైద్యులను వివిధ పరీక్షల గురించి వాకబు చేశారు. శిబిరానికి వచ్చిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. గ్రామ పెద్దలను, స్థానికులను పలకరించారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వస్త్ర బహూకరణలో ఎమ్మెల్యే వసంత



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** బాడిశ వారి నూతన వస్త్ర బహూకరణలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని టీడీపీ కుటుంబ సభ్యులు బాడిశ నాగరాజు – శివరాధల కుమారుడు చిన్నారి తులసిరామ్ నూతన వస్త్ర బహూకరణ వేడుకలు గురువారం కొండపల్లిలో జరిగాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ చిన్నారిని, ఆశీర్వదించి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు(గాంధీ), ఎన్డీఏ కూటమి నేతలు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబాను దర్శించుకున్న జంపాల

### అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన జంపాల సీతారామయ్య



**జి కొండూరు మేజర్ న్యూస్ :** పవిత్రమైన కార్తీక మాసం సాయిబాబాకు అత్యంత ఇష్టమైన గురువారం కొండపల్లిలో బి కాలనీ లో గల షిరిడి సాయిబాబా గుడిలో సాయిబాబా ను దర్శించుకున్నారు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య. ఈ సందర్భంగా గుడి ధర్మకర్తలు, కమిటీ సభ్యులు స్వాగతం పలికి బాబా వారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా వారి కండువాతో సత్కరించి ప్రసాద్ అందజేశారు. అనంతరం ప్రతి గురువారం జరిగే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు జంపాల సీతారామయ్య. స్వయంగా భక్తులకు అన్న వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత పవిత్రమైన కార్తీక మాసంలో సాయిబాబా గుడి దర్శన చేయటం సంతోషకరమని, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గుడి కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఆ శిరిడి సాయినాధుని ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

# నాలుగు నియోజకవర్గాలకు ఓటర్ల నమోదు అధికారులుగా రెవిన్యూ శాఖ అధికారులను నియమించాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో నాలుగు నియోజకవర్గాలకు ఓటర్ల నమోదు అధికారులుగా రెవిన్యూ శాఖ అధికారులను నియమించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ను కోరారు. గురువారం ఉదయం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ రాష్ట్రంలోని జిల్లా ఎన్నికల అధికారులైన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల చట్టాలు, నియమ నిబంధనలపై ఆన్లైన్ కార్యశాలను నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ప్రజా ప్రాతినిధ్యం చట్టం 1950, వివిధ ఆర్టికల్స్, విభాగాల వివరిస్తూ ఎన్నికల సంఘం అధికారాలు, ఓటర్ల జాబితా తయారీ, ప్రచురణ, సవరణ, ఎన్నికల అధికారులకు శిక్షణ,ఓటర్ల నమోదు కార్యక్రమం నమోదు పత్రాలు క్లెయిముల పరిష్కారం, ఎన్నికల నిర్వహణ తదితర ఎన్నికల అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సుదీర్ఘంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అవనిగడ్డ, పామర్రు, పెడన, గన్నవరం నాలుగు శాసనసభ నియోజకవర్గాలకు రెవిన్యూ శాఖేతర అధికారులు డీఎస్ఓ, డిఎం పౌరసరఫరాల సంస్థ, బీసీ సంక్షేమ అధికారి, ముడా వీసీలు ఓటర్ల నమోదు అధికారులుగా ఈఆర్వోలు పనిచేస్తున్నారన్నారు. ప్రస్తుతం జిల్లాలో క కావల్సినంతమంది రెవెన్యూ శాఖ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు పనిచేస్తున్నా రని,వారిని ఈఆర్వోలుగా నియమిస్తే ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం పటిష్టంగా, నాణ్యతగా జరుగుతుందని సీఈవోకు తెలిపారు. దీంతో సీఈఓ సానుకూలంగా స్పందిస్తూ అందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్కు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు ఆర్డీవో కే.స్వాతి, డిఎస్ఓ మోహన్ బాబు, బీసీ సంక్షేమ అధికారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంజినీరింగ్ విద్యార్థులతో మాజీ శాస్త్రవేత్త పద్మశ్రీ డాక్టర్ ఎంవైఎస్ ప్రసాద్ చర్చాగోష్టి





**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ నవంబరు 06 :** స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో నేటి ఉదయం పద్మశ్రీ అవార్డు గ్రహీత, డాక్టర్ ఎం.వై.ఎస్. ప్రసాద్, మాజీ విశిష్ట శాస్త్రవేత్త మాజీ డైరెక్టర్, ఎస్. డి. ఎస్. సి. షార్, ఇస్రో, మాజీ వైస్ ఛాన్సలర్ విజ్ఞాన్ యూనివర్సిటీ, చివరి సంవత్సర ఇంజినీరింగ్ విద్యార్థినీ విద్యార్థుల ఉద్దేశిస్తూ "అంతరిక్ష కేంద్రాలు, అంతరిక్ష జీవనం" అనే అంశంపై నిపుణుల ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి చుట్టూ ఉన్న వివిధ రకాల కక్ష్యల గురించి వాటి గమ్యము, తీరును ఉద్దేశిస్తూ మానవ అంతరిక్ష ప్రయాణ దశలు, అంతరిక్ష కేంద్రాలు, వాటి నిర్మాణానికి కారణమైన కీలక అంశాలను విశదీకరించారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ఐఎస్ఎస్ నిర్మాణరూప కల్పన నేపథ్యంలో నిగూఢమైన సాంకేతిక అంశాలను కళ్ళకు కట్టినట్లు లఘు చిత్రాల ద్వారా వివరించారు.

అంతరిక్షంలో జరిగే క్రిటికల్ రిపేర్ స్పేస్ వాక్స్, అలాగే అంతరిక్షంలో మనుషులు ఎలా జీవిస్తారు ఆహారం, నీరు, ప్రాణవాయువు, నివాస వ్యవస్థల నిర్వహణ వంటి అంశాలను విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో వివరించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ అధ్యక్షతన పద్మశ్రీ అవార్డు గ్రహీత, మాజీ విశిష్ట శాస్త్రవేత్త డాక్టర్ ఎం వై ఎస్ ప్రసాద్ తో జరిగిన ముఖాముఖి చర్చ సమావేశంలో కళాశాల డైరెక్టర్, డైరెక్టర్స్ వివిధ విభాగాధిపతులు, ప్రొఫెసర్స్ పాల్గొన్నారు. అంతరిక్ష కేంద్రాలు వాటిని గురించిన అంశాలు ఇంజనీరింగ్ విద్యాశాలలో ఎంతో ముఖ్య భూమిక వహిస్తాయని అభిప్రాయపడ్డారు. అంతరిక్ష శోధన పరిశోధన అంశాలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, డైరెక్టర్ పి.సిద్దయ్య, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి. రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపల్ ఎకడమిక్స్ డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్ శాస్త్రి, పి.జి.సి.ఆర్.డి డైరెక్టర్ డాక్టర్ జి. వి. ఎస్. ఆర్. వి. ప్రసాద్, ఏ.ఎస్.ఏ డైరెక్టర్ డాక్టర్ ఎం. కామరాజు, కన్వీనర్లు డాక్టర్ ఎం. బాబూరావు, డాక్టర్ ఎన్. రాజేశ్వరి, వివిధ విభాగాతిపతులు, మెంటర్స్,అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు

# నారాయణలో ఘనంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఎస్ఎల్సి





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక మచిలీపట్నం శిడింబి అగ్రహారంలో గల నారా యణ స్కూల్లో మంగళ, బుధ వారములలో నిర్వహించిన స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఎస్.ఎల్.సిలో భాగముగా విద్యార్థినీ విద్యార్థుల నేతృత్వంలో సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో విద్యార్థినీ విద్యార్థులు తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తమ అభ్యాసం, సాధించిన విజయాలు,, భవిష్యత్తు లక్ష్యాల గురించి స్వయంగా వివరించారు. ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులకు సహాయకులుగా వ్యవహరించారు. స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఎస్ ఎల్.సి కార్యక్రమాన్ని ఉద్దేశించి నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ సి.హెచ్ సాయి సుధీర్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులులో బాల్య దశ నుండే నాయకత్వ లక్షణాలు పెంపొందించే విధముగా చేయాలనే ప్రధాన ఉద్దేశంతో నిన్న, నేడు విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లి తండ్రులు,యాజమాన్యంలో వివిధ హోదాలలో పని చేస్తున్న అందరినీ సమన్వయ పరుచుకుని ఈ స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఎస్ ఎల్.సి నిర్వహించటం జరిగినది అన్నారు. స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఎస్. ఎల్ సికి ముఖ్య అతిథిగా హాజరైన ఈ కిడ్స్ ఆర్ & డి మరియా పాట్రిక్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు తమ అభ్యాసానికి బాధ్యత వహించేలా చేయడం, తమ పురోగతిని ప్రతిబింబించేలా చేయడం,, భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేసుకునేలా చేయడం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్(ఎస్.ఎల్.సి)ముఖ్య లక్ష్యం అని, ఆ లక్ష్యం వంద శాతం మచిలీపట్నం విద్యార్థులు చేరుకోగల్గినారు అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన కో ఆర్డినేటర్ ప్రతిభ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవ డానికి, కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపర చుకోవడానికి ఇది ఒక మంచి అవకాశం అని అన్నారు. గౌరవ అతిథిగా హాజరైన క్లస్టర్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ అభ్యాస ప్రయాణాన్ని తల్లిదండ్రులతో పంచుకోవ డానికి ఈ స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఎస్.ఎల్.సి ఒక మంచి వేదికను అన్నారు. విద్యార్థిని విద్యార్థులు తమ పనిని, నేర్చుకున్న విషయాలను చక్కగా ప్రదర్శించారని తెలుపుతూ... సంబంధిత విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. విద్యార్థినీ విద్యార్థుల కేరింతలు తల్లి తండ్రులు, ఉపాధ్యాయుల ఆనందోత్సవంల నడుమ మంగళ, బుధవారం లలో ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఈ చాప్స్ వైస్ ప్రిన్సిపాల్ ధూళిపూడి చందన,ఏవో వి రవి కుమార్, ఎన్.జెస్సికా,శైలజ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## మత్స్య సహకార ఎన్నికలు బహిష్కరించిన ఎస్సీలు



**గుడ్లవల్లేరు నవంబరు 6 మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మత్స్యకారుల సహకార ఎన్నికలు వివాదాస్పదంగా మారాయి. ఎస్సీ మాలలు, బిసి వడ్డెరలు సొసైటీలో రెండు గ్రూపులై 2014 నుండి న్యాయ పోరాటాలు, బలాబలాలు ప్రదర్శిస్తు న్నారు. మత్స్య శాఖ అధికారులు గురువారం జరిగిన మత్స్య సహకార ఎన్నికలు హరిజన మత్స్య సహకార సంఘం లిమిటెడ్ నెం.ఎస్ఎన్1, గుడ్లవల్లేరుపై ఎన్నికలను నిర్వహించక మత్స్య సహకార సంఘం, గుడ్లవల్లేరు అని మత్స్య శాఖ అధికారులు ఎన్నికలు నిర్వహించడంపై నిరసన వ్యక్తం చేస్తూ దళిత మాల(ఎస్సీ హరిజన) మత్స్య కారులు ఎన్నికలను బహిష్కరించామన్నారు. 1951 నుండి వున్న సంఘం పేరును మార్చివేయడమేకాక, జారీచేసిన ఎన్నికల నోటిఫికేషన్, ఎన్నికల ఓటర్ల జాబితాపై చేసిన అభ్యంతరాలపై విచారణ చేయక, పరిష్కారం చేయక ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తూ ఏకపక్ష ధోరణితో భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తూ, ఎస్సీల హక్కులు కాలరాస్తూ మత్స్య శాఖ ఎన్నికలు జరిపించడాన్ని నిరసిస్తున్నామంటూ గుడ్లవల్లేరు సెంటరులోని అంబేద్కర్ విగ్రహానికి ఎస్సీ మత్స్య కారులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు ముత్యాల సత్యనారాయణ, సభ్యులు కోండ్రు కోటేశ్వరరావు, వీరాబత్తిన గాబ్రియేలు, ఇలపర్తి వీరయ్య, గురజ రాంబాబు, దారం నిరంజనరావు, మద్దాల రవీంద్ర, రేమల్లి డేవిడ్, సింగవరపు వెంకట్రావు, తోట లోకనాథం, వీరాబత్తిన నాగేశ్వరరావు తదితరులు 22 మంది పాల్గొన్నారు.

## గిరిజన బిడ్డలంతా ఆర్థికంగా పురోగతి సాధించాలి

### జిల్లా రెవెన్యూ అధికారి కే.చంద్రశేఖర్ రావు



**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** గిరిజన బిడ్డలంతా చదువుకుని ఆర్థికంగా పురోగతి సాధించాలని జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్ రావు పిలుపునిచ్చారు. గిరిజన సంక్షేమ శాఖ కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో స్థానిక ముస్తా ఖాన్ పేట దేవుని తోట వద్ద గల గిరిజన కాలనీలో ఆధార్ ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధార్ కేంద్రానికి విచ్చేసిన డిఆర్ఓ చంద్రశేఖర రావు మాట్లాడుతూ ఆర్థిక ప్రగతికి ఆధార్ నమోదు తప్పనిసరి అని అత్యంత వెనుకబడిన యానాదులకు ఆధార్ నమోదు కు గిరిజన సంక్షేమ శాఖ చేస్తున్న కృషిని ప్రశంసించారు ఆధార్ క్యాంపులు వినియోగించుకుని గిరిజనులు అంతా తప్పనిసరిగా ఆధార్ నమోదు కావాలని ఆధార్ నెంబర్ వచ్చిన తదుపరి సంక్షేమ కార్యక్రమాల అమలు చేపడతామని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి ముదిగొండ ఫణి ధూర్జటి మాట్లాడుతూ జిల్లాలో 9 మండలాల్లో ఆధార్ సేవలను అందజేస్తున్నామని జిల్లా వ్యాప్తంగా గిరిజనులందరూ ఆధార్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర రావు స్థానిక యానాది విద్యార్థులకు క్యారం బోర్డ్, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రతినిధులు కిరణ్,బొద్దు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## తపాలా భీమా చెక్కు అందజేత



**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పసుమర్రు గ్రామానికి చెందిన కలతోటి ఏడుకొండలు (46) గ్రామంలోని పోస్ట్ ఆఫీస్ లో గ్రామీణ తపాలా జీవిత భీమా పాలసీ తీసుకుని ఉండి ఇటీవల గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. దీంతో ఈ భీమా పాలసీకి నామినీగా ఉన్న ఏడుకొండలు సతీమణి రత్నకుమారికి గురువారం పోస్టల్ అధికారులు చెక్కును అందజేశారు. మచిలీపట్నం పోస్టల్ సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు, పామర్రు సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ జి.వి.బెనర్జీ, పసుమర్రు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ పి.వసంతరావు లు 43,821 రూపాయల చెక్కును రత్నకుమారికి అందించారు.

## కోడి పందాల శిబిరంపై దాడి..

### 23 మంది అరెస్టు.. 25 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని దేవరపల్లి గ్రామ శివారులో కోడి పందాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు గురువారం తోటవల్లూరు పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో కోడిపందాలు నిర్వహిస్తున్న 23 మందిని అరెస్ట్ చేయడంతో పాటు 25 ద్విచక్ర వాహనాలు, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సిహెచ్.అవినాష్ తెలిపారు. కృష్ణానది ఒడ్డున నిర్వహిస్తున్న ఈ కోడి పందాల పై దాడి చేసేందుకు ప్రయత్నించగా పారిపోతున్న వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే వారి వద్ద నుండి రూ.17,300ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండలంలో ఎక్కడైనా జూదం, కోడిపందాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై అవినాష్ హెచ్చరించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు అందజేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



**జగ్గయ్యపేట నవంబర్ 6 మేజర్ న్యూస్ :** జగ్గయ్యపేట నియోజకవర్గానికి చెందిన 29 మంది బాధితులకు మొత్తం రూ. 14,67,529 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తన నివాసంలో స్వయంగా అందజేశారు.వాటి వివరాలు పట్టణానికి చెందిన 4 మందికి, వత్సవాయి మండలానికి చెందిన 12 మందికి, పెనుగంచిప్రోలు మండలానికి చెందిన 9 మందికి, జగ్గయ్యపేట మండలానికి చెందిన 4 మందికి చెక్కులు పంపిణీ చేయబడ్డాయి.ఈ కార్యక్రమంలో కొఠారు సత్యనారాయణ ప్రసాద్, ఇర్రి నరసింహారావు, నకిరకంటి వెంకట్, మల్లెల కొండయ్య, కర్ల జోజి, గుంజ ఏడుకొండలు, బెల్లం కోటేశ్వరరావు, కంభంపాటి పుల్లారావు, వంగూరి కోటేశ్వరరావు, గడ్డిపర్తి రాంబాబు, కారుపాటి ఏసుబాబు, కొత్తపల్లి సతీష్, పల్లెబోయిన నాగరాజు, ముత్యాల వెంకటేశ్వర్లు, ములకాలపల్లి నవీన్, ముక్కు ప్రశాంత్, షేక్ ఉమ్మర్, మల్లెల సాయి, కొత్తపల్లి రాజు, షేక్ షాజహాన్, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరు మత్స్య సహకార సంఘ ఎన్నిక ఏకగ్రీవం

**గుడ్లవల్లేరు నవంబరు 06 మేజర్ న్యూస్:** జిల్లా కలెక్టర్, కృష్ణా ఉత్తర్వుల మేరకు మత్స్యకారుల సహకార సంఘం లిమిటెడ్ నెం.ఎన్ఎన్1, గుడ్లవల్లేరు ఎన్నికలను గురువారం ఉదయం గుడ్లవల్లేరు జిల్లా పరిషత్ హైస్కూలులో నిర్వహించినట్లు 9 మంది డైరెక్టర్లు, కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి డి.స్వామి శేఖరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షులు కుంచాల ఏడుకొండలు, ఉపాధ్యక్షులు కుంచాల ఆంజనేయులు, కార్యదర్శి కుంచాల దుర్గారావు, డైరెక్టర్లు కుంచాల కొండయ్య, కుంచాల నరసింహారావు, కుంచాల వెంకట్రావు, కుంచాల శ్రీనివాసరావు, వల్లెపు ఏడుకొండలు, వేముల చిరంజీవి తదితరులు 5 సంవత్సరాల కాలానికి కార్యవర్గంగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి స్వామి శేఖరరావు ప్రకటించారు. గుడ్లవల్లేరు ఎంపిడిఓ ఎండి ఇమ్రాన్, పంచాయతీ కార్యదర్శి ఎజెఎల్ నరసింహారావులు ఎన్నికను పరిశీలించగా గుడ్లవల్లేరు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## జోగి రమేష్ కులం కార్డు వాడుకోవటం సిగ్గుచేటు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** లిక్కర్ కేసులో అరెస్ట్ అయిన జోగి రమేష్ కులాన్ని అడ్డుపెట్టుకొని మాట్లాడటం సిగ్గుచేటని ఏఎంసీ చైర్మన్లు కొల్లూరు వెంకటేశ్వరరావు విమర్శించారు. గురువారం స్థానిక నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నాసిరకం మద్యంతో అనేకమంది ప్రాణాలు పోయాయన్నారు. ఆధారాలతో దొరికిన జోగి రమేష్ కులాన్ని వాడుకునే ప్రయత్నం హేయమన్నారు. గౌడకులంలో ఎంతోమంది ఉన్నత స్థాయి నాయకులున్నా వారెప్పుడూ కులం కార్డు వాడుకోలేదని, ఉన్నత భావాలతో జీవించారన్నారు. గత ప్రభుత్వంలో అధికారం అడ్డుపెట్టుకొని విర్రవీగిన జోగి రమేష్ ఇప్పుడు కులం పేరు తీసుకురావటం సిగ్గుచేటు అన్నారు. నాసిరకం మద్యంతో జరిగిన దుష్పరిణామాలకు బాధ్యులు ఎవరైనా చట్ట ప్రకారం శిక్షకు గురవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ అద్దంకి నారాయణరావు, సీనియర్ నాయకులు బండే రాఘవ, పిఏసిఎస్ అధ్యక్షులు బళ్ళ ప్రసాద్, మాజీ సర్పంచ్ చెన్ను గాంధీ, డైరెక్టర్ పుప్పాల యేసు, బళ్ళ శ్రీనివాసరావు లు పాల్గొన్నారు.

# సింహాద్రి రమేష్ దుశ్చర్యతోనే ఎదురుమొండి బ్రిడ్జికి ఆటంకం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ దుశ్చర్యతోనే ఎదురుమొండి బ్రిడ్జికి ఆనాడు ఆటంకం కలిగిందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటిమొగ – ఎదురుమొండి బ్రిడ్జికి టీడీపీ ప్రభుత్వంలో తాను ఆసియా బ్యాంకు నిధులు తెస్తే జగన్ అనుకూల అధికారి కొర్రీ పెట్టారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఎంపీ వల్లభనేని బాలశౌరి స్నేహితుడైన నాబార్డ్ చైర్మన్ ద్వారా ఎంపీ బాలశౌరి ఎదురుమొండి బ్రిడ్జికి నిధులు తెచ్చారని తెలిపారు. నాగాయలంక పర్యటనకు, మత్స్యకారులకు సహాయం కార్యక్రమానికి నాబార్డ్ చైర్మన్, ఎంపీ వస్తే, సింహాద్రి రమేష్ చేసిన దుశ్చర్యతో మళ్ళీ ఆటంకం కలిగిందన్నారు. రూ.109 కోట్లు కేటాయించిన నాబార్డ్ చైర్మన్ నియోజకవర్గానికి వస్తే స్వాగత సత్కారాలతో ఆహ్వానించాల్సిన స్థానిక ఎమ్మెల్యే బాధ్యత మరిచి, సభ అంతా ఛిన్నాభిన్నం చేసి, ఆయనను భయాందోళనకు గురి చేసి, ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణం ప్రారంభం కాకపోవటానికి ప్రధాన కారకుడు సింహాద్రి రమేష్ అని బుద్ధప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు వారి అధినేత జగన్ నాబార్డ్ నిధులు రూ.109 కోట్లలో కొంత పథకాలకు మళ్ళించేయటంతో తదుపరి ఎంపీ బాలశౌరి చేసిన ప్రయత్నాలు చేసినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్నారు. ఇటీవల మొంథా తుఫాన్ నష్టాన్ని నియోజకవర్గ పర్యటన ద్వారా తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మొట్టమొదటిసారిగా ప్రత్యేకంగా అవనిగడ్డ నియోజకవర్గం కోసం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి, ఎదురుమొండి బ్రిడ్జికి సాస్కి నిధులు ఇస్తున్నట్లు ప్రకటించటంతో హై లెవల్ బ్రిడ్జికి మార్గం సుగమం అయిందని బుద్ధప్రసాద్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గానికి రూ.100 కోట్ల మేలు చేయనున్నారని బుద్ధప్రసాద్ తెలిపారు. ఎదురుమొండి బ్రిడ్జికి సాస్కి నిధులు ఇవ్వనుండటంతో బ్రిడ్జి నిర్మాణం సాధ్యమైనంత వేగంగా సాకారం అవుతుందన్నారు. ఈ అవుట్ ఫాల్ స్లూయిజుల పునర్నిర్మాణం అంశాన్ని నియోజకవర్గ పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన ప్రత్యేకించి అవనిగడ్డ నియోజకవర్గం కోసం నిర్వహించిన ఉన్నత స్థాయి అధికారుల సమావేశంలో ఈ అంశంపై చర్చించి జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ నిధుల సాధనకు ఢిల్లీ వెళ్తానని ప్రకటించడం హర్షణీయం అన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం పట్ల పవన్ కళ్యాణ్ చూపిన ప్రత్యేక శ్రద్ధతో ఎదురుమొండి బ్రిడ్జి, ఔట్ ఫాల్ స్లూయిజులు, గొల్లమంద రోడ్డు, సాగర సంగమ అభివృద్ధి సాకారం కానున్నాయని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రికి అవనిగడ్డ నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదములు తెలిపారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, యువ నాయకుడు మండల వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, జనసేన మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు, మర్రె గంగయ్య, పూషడపు రత్నగోపాల్, పీఏసీఎస్ చైర్మన్ అరజా రాధిక, జనసేన సీనియర్ నాయకులు బచ్చు వెంకట్ నాథ్ ప్రసాద్, బాసు నాంచారయ్య నాయుడు, జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, ఏఎంసీ డైరెక్టర్ కోలపల్లి శ్రీవర్ష, ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, సిద్దినేని కుమార్ రాజా, కటికల వసంత్, సర్పంచులు కనగాల వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి శ్రీదుర్గ, సొసైటీ అధ్యక్షులు, నీటి సంఘాల అధ్యక్షులు, ఏఎంసీ డైరెక్టర్లు, ఆసుపత్రి డైరెక్టర్లు, ఆయా మండలాల జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలో బంగారు పతకం సాధించిన బందరు బాడీ బిల్డర్

**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** మచిలీపట్నం మాచవరానికి చెందిన బీరం ప్రశాంత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలో బంగారు పతకం సాధించాడు. నోబుల్ శాలలో ఇంటర్మీడియట్, బీకాం చదివి హిందూ కళాశాలలో ఎంబిఏ పూర్తి చేశారు అందరితో చెరగని చిరునవ్వుతో స్నేహంగా మెలిగే ఆయన పేరుకు తగినట్లే ప్రశాంత్ వదనంతో ఆప్యాయంగా పలకరించే మంచి వ్యక్తిత్వం, కొద్దికాలం పాత్రికేయ రంగంలో సైతం రిపోర్టర్ గా కొంతకాలం కొనసాగారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 80 మంది బాడీ బిల్డర్లు పాల్గొన్న ఈ కాంపిటేషన్ లో ప్రశాంత్ ఈ విజయాన్ని సాధించడానికి కొన్నేళ్ల నుంచి అలుపెరగకుండా దేహ దారుఢ్య పరిశ్రమ చేస్తూ ఎంతో కష్టపడి విజేతగా నిలిచారు. ఇటీవలే ఆయన సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక అయ్యారు. ఎన్నో మంచి ఉద్యోగ అవకాశాలు, వివాహ సంబంధాలు వస్తున్నా వాటిని సైతం వాయిదా వేస్తూ తన లక్ష్యం ఇంకా పూర్తి కాలేదని, జాతీయ స్థాయిలో బాడీ బిల్డింగ్ లో స్వర్ణ పతకాన్ని సాధించి మన ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకురావాలని తన ఆశయమని పట్టుదలతో చెబుతున్న బీరం ప్రశాంత్ తన గమ్యాన్ని విజయవంతంగా చేరుకోవాలని బందరు ప్రజలు కోరుకుంటున్నారు.





## స్వర్గీయ మండలి విగ్రహానికి నివాళులర్పించిన చల్లపల్లి కూటమి నాయకులు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** దేశ విదేశాల స్వచ్ఛంద సంస్థల ఆపన్న హస్తాన్ని దివిసీమకు అందించిన మహనీయుడు మండలి వెంకట కృష్ణారావు అని టీడీపీ చల్లపల్లి మండల అధ్యక్షులు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు అవనిగడ్డలో ఘనంగా జరుగుతున్నాయి. గురువారం అవనిగడ్డ వంతెన సెంటర్లోని కృష్ణారావు విగ్రహానికి మోర్ల రాంబాబు, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, ఏపీ స్టేట్ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయ రాధిక, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ, ఎంపీటీసీ, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ పైడిపాముల స్వప్న, మాజీ వైస్ ఎంపీపీ, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ స్టేట్ డైరెక్టర్ బోలెం నాగమణి, తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి రావి చంద్రశేఖర్ (చిట్టి), పీఏసీఎస్ చైర్మన్ బొందలపాటి వీరబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కొడాలి మురళి, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ నబీఘోరి, ఆసుపత్రి డైరెక్టర్ వరదా హరిగోపాల్, ప్రముఖ న్యాయవాది తుటారం ప్రసాద్, ఏఎంసి డైరెక్టర్లు సుదాని నందగోపాల్, షేక్ ఇబ్రహీం, జనసేన పార్టీ మండల నాయకులు అనుమకొండ పూర్ణ చంద్రశేఖర రావు (ప్రెస్ పూర్ణ), ఉరిమి మణికాంత్, తోట మురళీకృష్ణ, మడమల రంజిత్, టీడీపీ నాయకులు కోట సత్యనారాయణ – పద్మావతి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువ నాయకుడు మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, మోపిదేవి మండల జనసేన పార్టీ అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, టీడీపీ టౌన్ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్లు యలవర్తి రాజ నాగ మునేశ్వరరావు, కోసూరు నాగమల్లేశ్వరరావు, పూతబోయిన కరుణకుమార్, యర్రంశెట్టి సుబ్బారావు, బళ్లా సీతారాంప్రసాద్, డైరెక్టర్ పుప్పాల ఏసు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, గాంధేయవాది గరికపాటి సీతారామయ్య, ప్రముఖ న్యాయవాది బొప్పన వెంకట సుబ్రహ్మణ్యేశ్వర రావు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, టీసీ అధ్యక్షులు రేపల్లె రవీంద్ర, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, బడే సుబ్బారావు, బచ్చు ఆదినారాయణ, చల్లపల్లి నుంచి రావి రాజేశ్వరరావు, పైడిపాముల రాజేంద్ర, వేముల హరికృష్ణ, షేక్ సిలార్, షేక్ దిల్షాద్ నజరానా, బావిశెట్టి కనకదుర్గ, పఠాన్ జిలాని, మేడికొండ రవిబాబు, అనగాని నాగేశ్వరరావు, మిరియాల జితేంద్ర, డేవిడ్, కుంభా శ్రీకృష్ణ, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణకు సిద్ధంకండి



ఎన్‌టీఆర్ జిల్లా, నవంబర్ 06, మేజర్ న్యూస్ : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ సమ్మరీ రివిజన్-ఎస్ఐఆర్) ప్రక్రియపై పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకొని సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులకు సూచించారు. గురువారం రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) వివేక్ యాదవ్.. వెలగపూడి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950లోని కీలక సెక్షన్లు, ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రాధాన్యత, గత ఎస్ఐఆర్ (2002), సమగ్ర సవరణ ప్రక్రియలో భాగస్వామ్య పక్షాలు, బూత్ లెవెల్ అధికారి (బీఎల్‌వో), బూత్ లెవెల్ ఏజెంట్ (బీఎల్ఏ), ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోల పాత్ర, ఎన్యూమరేషన్ ఫారాలు (ఈఎఫ్), ఇంటింటి సందర్శన, పరిశీలన అంశాలతో పాటు రాజకీయ పార్టీల భాగస్వామ్యం గురించి సీఈవో వివేక్ యాదవ్ వివరించారు. వీసీ అనంతరం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులతో మాట్లాడుతూ సన్నద్ధతలో భాగంగా ఎస్ఐఆర్ ప్రక్రియలోని ముఖ్య దశలపై పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ అవగాహన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతానికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. వివిధ ఫారాల పరిష్కారం, ఎపిక్ కార్డుల జారీ తదితరాలపైనా కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో సమీక్షించారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ పి.సలీమ్, డిప్యూటీ తహసీల్దార్ ఎ.గోపాలర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాఫ్ట్‌బాల్ బేస్బాల్ పోటీలకు నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీలు ఎంపిక



నాగాయలంక నవంబర్ 6 మేజర్ న్యూస్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం కృష్ణాజిల్లా గూడూరులో అండర్ 17 అండర్ 14 సాఫ్ట్బాల్ బేస్బాల్ కృష్ణాజిల్లా సెలక్షన్స్ జరిగినాయి వీటిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాగాయలంక విద్యార్థినీ విద్యార్థులు 21 మంది పాల్గొనినారు. వీరిలో మెయిన్ ప్లేయర్స్ 17 మంది స్టాండ్ బై గాను ఒకరు మొత్తం 18 మంది సెలెక్ట్వావడం,నాగాయలంక హై స్కూల్ చరిత్రలో అకాడమిక్ ఇయర్ లో 18 మంది సెలెక్ట్ కావడం మొట్ట మొదటి సారి కావడం, డైరెక్టర్ గాజుల లక్ష్మీ ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు ట్రైనింగ్ క్లాసులో ఇచ్చి ఉత్తమ విద్యార్థినీలు దిద్దటం గర్వ కారణం.

## నారా భువనేశ్వరికి అవార్డు రావటం పట్ల టీడీపీ నేతల హర్షం..



చల్లపల్లి మేజర్ న్యూస్ : ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలకు గుర్తింపుగా నారా భువనేశ్వరి లండన్ లో ప్రతిష్టాత్మక ఇన్ స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ నుండీ డిస్టింగ్వి ష్డ్ ఫెలోషిప్ అవార్డు, హెరిటేజ్ ఫుడ్స్ ఎండి హోదాలో ఆ సంస్థకు ఎక్స్ లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో ప్రకటించిన గోల్డెన్ పీకాక్ అవార్డును అందుకోవడం పట్ల చల్లపల్లి టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. చల్లపల్లి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 10 కిలోల కేక్ ను పాగోలు ఎన్టీఆర్ మోడల్ స్కూల్ లో విద్యార్థినిల సమక్షంలో గురువారం కట్ చేశారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భువనేశ్వరి చేస్తున్న సేవలకు గుర్తింపు ఈ అవార్డు అని శ్రీనివాసరావు తెలిపారు. భువనేశ్వరి మహిళా లోకానికే కాకుండా తెలుగు ప్రజలందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, ప్రిన్సిపాల్ మధుసూదనరావు, సొసైటీ చైర్మన్ గుత్తికొండ వంశీకృష్ణ, టీడీపీ నేతలు మేకా వెంకటేశ్వరరావు, మేకా కమలకరావు (పెద్దబ్బాయ్) మల్లంపల్లి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తల సంక్షేమ నిధి నుండి మంజూరైన 5 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేత

వత్సవాయి, నవంబర్ 6, మేజర్ న్యూస్: మండల కేంద్రంలో గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త తన్నీరు వీరయ్య కుమారుడు తన్నీరు నాగబాబు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. గతంలో నాగబాబు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకుని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కష్టపడి పనిచేశారు. ఆయన అకాల మరణంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నాగబాబు యొక్క సభ్యత్వ వివరాలు, మృతి సమాచారం తెలుగుదేశం పార్టీ అధిష్ఠానానికి తెలియజేశారు. అనంతరం, కార్యకర్తల సంక్షేమ నిధి నుండి మంజూరైన రూ.5 లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే వత్సవాయి గ్రామంలో నాగబాబు కుటుంబ గృహానికి వెళ్లి స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## లోఓల్టేజ్ సమస్య ఎక్కడైనా ఉంటే తక్షణమే పరిష్కరించాలి

### ఏపీసీపీడీసిఎల్ సర్కిల్ ఆఫీస్ సీఎండీ పి. పుల్లా రెడ్డి



విజయవాడ, నవంబర్ 06, మేజర్ న్యూస్ : స్థానిక పీడబ్ల్యూడి గ్రౌండ్స్ వద్ద గల ఏపీసీపీడీసిఎల్ సర్కిల్ ఆఫీస్ సీఎండీ పి. పుల్లా రెడ్డి గురువారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్ఈ లు, ఈఈ లతో పీఎం సూర్య ఘర్, రెవెన్యూ కలెక్షన్స్, సైక్లోన్ డ్యామేజెస్, ఆర్డీఎస్ఎస్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ పి. పుల్లా రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ వసూళ్లను నూరు శాతం సాధించాలని ఆదేశించారు. అదేవిధంగా వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన విద్యుత్తును అందిస్తూ ఎక్కడైనా లోఓల్టేజ్ సమస్య ఉంటే వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. అంతేకాకుండా పీఎం సూర్య ఘర్ పథకానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీపై అవగాహన కల్పించి, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ఆదేశాలు ఇవ్వటం జరిగింది. సమీక్ష సమావేశం లో ఏపీసీపీడీసిఎల్ డైరెక్టర్లు మురళీ కృష్ణ యాదవ్, టీ వి ఎస్ ఎన్ మూర్తి, వెంకటేశ్వర్లు, సి. జి. ఎమ్ లు పాల్గొన్నారు.

## సత్తాచాటిన పులిగడ్డ గురుకుల విద్యార్థులు




అవనిగడ్డ, మేజర్ న్యూస్ : గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలెక్షన్ పోటీల్లో పులిగడ్డ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. గురువారం ప్రిన్సిపల్ కనపర్తి జాన్ మాట్లాడుతూ బి.ఎలిషా 1500 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, ట్రిపుల్ జంప్‌లో కూడా ప్రథమ స్థానం సాధించాడు. ఆర్. వరుణ్ 400 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, లాంగ్ జంప్‌లో కూడా ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాడు. అలాగే ఎ. ప్రసాంత్ 5 కిలోమీటర్ల వాక్‌లో ప్రథమ స్థానం, అఖిల్ 1500 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని వివరించారు ఈ సందర్భంగా పీఈటీ జి.వీరకుమార్‌కు, విద్యార్థులకు పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ విజయాలతో పులిగడ్డ గురుకులం మరోసారి క్రీడా రంగంలో కీర్తి పొందిందని వారు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన జిల్లా పౌరసరఫరాల మేనేజర్



రెడ్డిగూడెం, నవంబర్ 6, మేజర్ న్యూస్: మండల పరిధిలోని రెడ్డిగూడెం పి.ఎ. సి.ఎస్, మద్దులపర్వ గ్రామములో ధాన్యం కొనుగోలు కేంద్రమును గురువారం జిల్లా పౌరసరఫరాల మేనేజర్ సురేష్ కుమార్ సందర్శించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు అందరూ రైతు సేవా కేంద్రంలో ధాన్యం విక్రయించ వలసినదిగా రైతులకు అవగాహన కలిగించారు, అన్ని ఆర్.ఎస్.కె లకు గొనె బస్తాలు సరిపడాగా, తేమ చూసే మిషనులను కూడా పంపియున్నామని అన్నారు. రైతులు తమ ట్రాక్టర్లు కు జి.పి.ఎస్ అమర్చుకొని ధాన్యం సకాలంలో మిల్లులు తరలించుటకు రెడీగా ఉంచుకోవాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమమునందు తహసిల్దార్ జె సుశీలా దేవి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గంధం పుల్లయ్య, వి.అర్.ఓలు, వి.ఏ.ఏ.లు, రైతులు, పి.ఏ.సి.ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్



ఎన్టీఆర్ జిల్లా, నవంబర్ 06, మేజర్ న్యూస్ : ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ గురువారం విజయవాడ, రామవరప్పాడులో రేషన్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ దుకాణం ద్వారా కార్డుదారులకు అందుతున్న సేవలు, సరుకులకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం రామవరప్పాడులో అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కేంద్రం ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న పౌష్టిక ఆహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందిస్తున్న తీరును పరిశీలించారు. చిన్నారుల మేధో వికాసానికి నిర్దేశించిన పాఠ్య ప్రణాళికను కచ్చితంగా అమలు చేసేలా, ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు సకాలంలో నాణ్యమైన సరుకులు అందించడం జరుగుతుందన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నట్లు వివరించారు.



# కొమ్మారెడ్డి స్కూల్‌లో చిన్నారుల 100 రోజుల పండుగ

**బంటుమిల్లి మేజర్ న్యూస్ :** కొమ్మారెడ్డి స్కూల్ లో ప్రి ప్రైమరీ చిన్నారులు స్కూల్‌లో తమ మొదటి 100 రోజులు విద్యాభ్యాసం పూర్తి చేసిన సందర్భంగా గురువారం ఆనందోత్సాహాలతో 100 రోజుల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్కేజీ, యూకేజీ విద్యార్థులు వివిధ చిత్రాలు గీసి పిస్తా, వేరుశనగ వ్యర్థాలు, మిరియాలు, థర్మాకోల్ బాల్స్ వంటివి ఉపయోగించి చార్టుల పై 100 రోజుల పండుగ అని వ్రాసినవి అందరిని అలరించాయి. కొందరు విద్యార్థులు ఈ 100 రోజులలో స్కూల్ లో నిర్వహించిన వివిధ కార్యక్రమాల ఫోటోలను థర్మాకోల్ పై అమర్చిన తీరు అందరిని ఆకట్టుకుంది. స్కూల్ లో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం అవలంభించే పద్ధతులు, అమలు చేసే వివిధ విధానాల గూర్చి తయారుచేసిన చార్ట్ అందరిని ఆకట్టుకున్నది. ఈసందర్భంగా స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ మాట్లాడుతూ చిన్నారులలో ఆహ్లాదాన్ని కలిగించి, ఉత్సాహపరచడానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతి చిన్నారిని స్కూల్ లో మొదటి 100 రోజులు స్కూల్ వాతావరణానికి అలవాటు చేస్తూ విద్యలో ఓనమాలు నేర్పటంలో ఎంతగానో కృషి చేస్తున్న ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ స్కూల్ సెక్రెటరీ, కరెస్పాండెంట్ కె. యస్. వి. జి. శోభ, యంగ్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హరణి, స్కూల్ హెచ్ఎం ఎన్.శ్రీనివాస రావు ఎల్కేజీ, యూకేజీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన నరసమ్మ కుటుంబ సభ్యులు

**పామర్రు మేజర్ న్యూస్ :** స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజాకు పామర్రు టౌన్‌కు చెందిన యార్లగడ్డ చిన్న వెంకట నరసమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వెంకట నరసమ్మకు ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ ఆపరేషన్ చేసేందుకు ఎమ్మెల్యే కుమార్ రాజా ఎల్.ఓ.సి (లెటర్ ఆఫ్ క్రెడిట్) ద్వారా 2.50 లక్షల రూపాయలు నిధులను ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు చేయించారు. ఆమెకు గుండె శస్త్ర చికిత్స విజయవంతం కావడంతో ఆ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కుమార్ రాజాను పామర్రు పార్టీ కార్యాలయంలో కలిసి ఆయనను సత్కరించి తమ కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఉన్న ప్రజాప్రతినిధులను సంప్రదించినా ఫలితం లేకపోయిందని, కానీ ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా వెంటనే స్పందించి సహాయం అందించారని ఈ సందర్భంగా వెంకట నరసమ్మ కుటుంబ సభ్యులు తెలిపారు. ఇది మన ప్రభుత్వం – మంచి ప్రభుత్వం, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం అని ఎమ్మెల్యే పేర్కొంటూ ఎవరికి ఎటువంటి అవసరం ఉన్నా వారికి సహకారం ఇస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా ప్రతినిధులుగా ఉన్న తాము వారి సమస్యలు పట్టించుకోకుంటే ప్రజల ఛీత్కారానికి గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, కావున ప్రజల అభిమానంతో గెలిచిన ప్రజా ప్రతినిధులు వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం ద్వారా వారి గుండెలలో సుస్థిర స్థానం ఏర్పరుచుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పామర్రు నియోజవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్, మండల పార్టీ అధ్యక్షుడు గుంపా గంగాధరరావు, తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన పలువురు పాల్గొన్నారు



# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి





**పెడన, మేజర్ న్యూస్:** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. గురువారం పెడన మండలంలోని మడక సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఎటువంటి తప్పిదాలు చోటుచేసుకోకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. దళారులను ఆశ్రయించకుండా రైతు సేవా కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులను కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. రైతుల పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించి, కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నదన్నారు. రైతులు ధాన్యంలో చెత్త, చెదారం లేకుండా, నిర్ణీత తేమ శాతం ఉండేలా చూసుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ధాన్యం సేకరణ పూర్తయ్యిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ వెల్లడించారు.

# ధాన్యం కొనుగోలు ఏర్పాట్లను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ నవీన్

**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** ధాన్యం కొనుగోలు కు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా జాయింట్ కలెక్టర్ మల్లవరపు నవీన్ మండలంలోని రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. గురువారం ఆయన గుడివాడ ఆర్డిఓ బి.బాలసుబ్రమణ్యం, స్థానిక తహసిల్దార్ బి శ్రీను నాయక్ లతో కలిసి మండల పరిధిలోని వెంట్రప్రగడ, వానపాముల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ నవీన్ ఆదేశించారు. రైస్ మిల్లుల నుండి గన్ని సంచులను వెంటనే తీసుకువచ్చే విధంగా ఏర్పాటు చేసుకోవాలని, అలాగే వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని ఆయన సూచించారు. ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి మరోమారు శిక్షణా తరగతులు నిర్వహించి ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా సక్రమంగా కొనుగోలు సాగేలా చూడాలని ఈ సందర్భంగా తహసిల్దార్ శ్రీను నాయక్ ను జాయింట్ కలెక్టర్ నవీన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ గుడివాడ సహాయ సంచాలకురాలు ఎస్ కవిత, మండల వ్యవసాయ అధికారి రాధ ఆంజనేయరావు, వెంట్రప్రగడ పిఎసిఎస్ చైర్మన్ కూచిపూడి వెంకట సుబ్బారావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వీఆర్వో ఫణికుమార్, పలువురు రైతులు, రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



## సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ట్రాఫిక్ డీసీపీ

**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** నవంబర్ ఒకటవ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సాధారణ బదిలీల నేపథ్యంలో గుంటూరు, తాడేపల్లి వక్ఫ్ కార్యాలయంలో సర్వే కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న షిరీన్ బేగంని ఎన్.టి.ఆర్.జిల్లా ట్రాఫిక్ డిప్యూటీ పోలీసు కమిషనర్‌గా బదిలీ చేసినారు. ఈ సందర్భంగా షిరీన్ బేగం వ్యాస్ కాంప్లెక్స్‌లోని ట్రాఫిక్ కార్యాలయంలో ట్రాఫిక్ డిప్యూటీ పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబుని మర్యాదపూర్వకంగా కలిసినారు.



## నున్నలో పలు కార్యక్రమాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ




**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** నున్న గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ భీమవరపు శివరామ రెడ్డి ఇంటి వద్దకు వచ్చి కొద్దిసేపు కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించారు. ఇటీవల ఆక్సిడెంట్ లో మరణించిన పోలారెడ్డి దినేష్ రెడ్డి పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి నివాళులు అర్పించారు. కుటుంబాన్ని పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దినేష్ రెడ్డి మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి, తన అకాలమరణం జీర్ణించుకోలేని విషయం అన్నారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అన్నివిధాలుగా అండగా ఉంటామని చెప్పిన వల్లభనేని వంశీ. తదనంతరం ఎనికేపాడులోని ఎంపీటీసీ గంగుల శ్రీనివాస్ మాతృమూర్తి అనారోగ్యంతో ఇబ్బంది బాధపడుతుండగా గృహానికి వెళ్లి క్షేమ సమాచారం అడిగి తెలుసుకుని అన్ని విధాలుగా అండగా ఉంటాను అని భరోసా కల్పించిన వల్లభనేని వంశీ... ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి యార్క రెడ్డి నాగిరెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షుడు పోలరెడ్డి చంద్రారెడ్డి,ఉపసర్పంచ్ బ్రహ్మానంద రెడ్డి, ఎంపీటీసీలు ప్రత్తిపాటి నాని,బొంతు సరోజినీ జీతం శ్రీను,అంబాపురం పార్టీ అధ్యక్షుడు నల్లమోతు చంద్రశేఖర్, సుబ్రహ్మణ్య రాజు,సొంగ దయాకర్, కిషోర్ యాదవ్,పెద్దలు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు...

## చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** నూతన వస్త్ర బహుకరణలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని టీడీపీ కుటుంబ సభ్యులు పోలగంగు రాణి, రత్నవేణుల కుమార్తె నందిని నూతన వస్త్ర బహుకరణ వేడుకలు గురువారం కొండపల్లిలో జరిగాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ చిన్నారిని, ఆశీర్వదించి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు(గాంధీ), ఎన్డీఏ కూటమి నేతలు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులు కావలెను
నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999